## రెండవ భాగము

# లోకము అను యుగము లేక ఇహ సంబంధమైన స్థితి

### ఉపోద్ఘాతము

*యేసు- నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు నా రాజ్యము ఈ లోక సంబంధమై నదైతే నేను యూదులకు అప్పగింపబడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహ సంబంధమైనది కాదనెను. యోహాను. 18:36.*

**యేసు రాజుగానున్న దేవుని రాజ్యము** ఈ లోక సంబంధమైనది కాదు. అయినను, ఆ రాజ్యములోనికి ప్రవేశించుటకు అది లోకములోని మనుష్యులకు అందుబాటులో నున్నది (కొలొస్స. 1:13). యేసు తన శిష్యులను లోకమునుండి ఏర్పరచుకొనెను (యోహాను 15:19). "క్రీస్తునందు" క్రైస్తవులు పరలోక సంబంధమైన స్థలములలో (heavenly places) క్రీస్తుతో కూడా కూర్చుండి యున్నారు (ఎఫెసీ. 2:7). ప్రస్తుత కాలములో మనకందుబాటులోనున్న **రెండు రాజ్యములను** బైబిలునందు "ఇహ సంబంధమైన రాజ్యము (world realm) అనియు, "క్రీస్తునందు" (in Christ) అనియు గుర్తింపబడినవి. ఎఫెసీ పత్రిక మొదటి అధ్యాయములో "క్రీస్తునందు" అనుమాట లేక దాని పర్యాయపదము ఒక డజనుమారులు వ్రాయబడియుండట గమనార్హము. అపొస్తలుడైన పౌలు **"వెలుపలివారు - లోపలివారు"** అనుమాటలు వాడియున్నాడు (1 కొరింథీ. 5:12). లోకము చీకటిమయము మరియు సాతాను ఈ లోకాధికారి (యోహాను 12:31; అపొ. కార్య. 26:18).

రోమా. 12:2 లోను గలతీ. 1:4 లోను వుపయోగింపబడినట్లు "ఇయాన్" (AION) అను గ్రీకుమాట నుండి "లోకము" అని మనము వాడుచున్న మాట వచ్చినది. ఇయాన్ అనుమాట నిర్దిష్టమైన తేదీలను గాని భౌతికపరమైన సరిహద్దులను గాని సూచించదు. ఈ తాత్పర్యములో అది "క్రీస్తునందు పరలోకసంబందమైన స్థలము" వంటిదైయున్నది. కేవలము అది ఒక యుగము లేక స్థితియైయున్నది. అది "లోకమునందు" అను యుగము లేక "ఇహ సంబంధమైన స్థితి".

ఆదాము పాపము చేసినప్పటి నుండి **"లోకమునందు"** అను రాజ్యము ఏర్పడినది. యేసు తండ్రియొద్దకు ఆరోహణమునకు పూర్వము గాని సువార్త ప్రకటింప బడక ముందుగాని (అపొ. కార్య. 2) వేరొక రాజ్యము మానవులకు అందుబాటులో లేదు. దేవుడు యేసును లేపెను గాని క్రీస్తు సంఘము అను క్రీస్తు శరీరము, కాలములోని మానవులకు అందుబాటులో ఉంచెను (ఎఫెసీ. 1:18,21). "క్రీస్తునందు", "క్రీస్తులో" అను మాటలలోని "అందు" మరియు "లో" అను ప్రత్యయముల అర్థములను బట్టి, క్రీస్తునందుండుట అనగా క్రీస్తు శరీరములో ఒక అవయవముగా నుండుటయే (రోమా 12:4,5). "లోకమునందు" అను యుగములోనికి భౌతికజన్మ ద్వారా మనము ప్రవేశించి యుంటిమి. ఆత్మీయ జన్మద్వారా "క్రీస్తునందు" అను స్థితిలోనికి ప్రవేశించ గలము.

*శరీర మూలముగా జన్మించినది శరీరమును ఆత్మమూలముగా జన్మించినది ఆత్మయునై యున్నది యోహాను 3:6*

ఈ రెండవ భాగములోని పాఠములు "లోకమునందు" అను స్థితిలోని భయంకరమైన స్థితిని వర్ణించును. పాపము అనునది చెడ్డ క్రియ అను దాని కంటే ఘోరమైనదని మొదటిగా గ్రహించుకొందము. పాపియైన వానిని ఏలు శక్తి పాపము. "పాపము మరణమును అధారము చేసికొని ఏలెను" అని పౌలు చెప్పిన మాటలోని భావమును కూడా గ్రహించుకొనవలసియున్నది (రోమా. 5:21). తరువాత పాఠములు సాతానుని గూర్చి తెలియజేయునట్టివి. సాతాను యొక్క శక్తి, స్వభావము, క్రియలను గూర్చి మనము నేర్చుకొనగలము. సాతానుతో సాంగత్యము కలిగియుండుటవలన వచ్చు భయంకర ప్రతిఫలమేమిటో అర్థము చేసికొందము. ఈ రెండవ భాగములోని చివరి పాఠములో సాతాను క్రియల మూలముగాను పాపమరణముల ద్వారా సంభవించిన మానసిక వాతావరణము వలన, మానవునికి కలిగిన నీచ స్థితిని చూడగలము.